# ఎక్స్‌లెన్స్ ఇన్ హెల్త్ కేర్

**మాదాసి వెంకయ్యను**

ఆరోగ్య రంగం వ్యక్తిగత కేటగిరీలో అత్యుత్తమ ప్రతిభకు డాక్టర్ మాదాసి వెంకయ్యను సాక్షి ఎక్సలెన్స్ అవార్డు వరించింది. ప్రజా వైద్యశాల పేరుతో ప్రకాశం జిల్లా ఉలవపాడులో డాక్టర్ మాదాసి వెంకయ్య పేదలకు వైద్యసేవలందిస్తున్నారు. గుంటూరు మెడికల్ కాలేజీ నుంచి ఎం.బి.బి.ఎస్., ఎం.ఎస్.జనరల్ సర్జరీ చేసిన డాక్టర్ వెంకయ్య అత్యంత పేదకుటుంబం నుంచి ఎదిగిన వ్యక్తి. కుటుంబ నియంత్రణకు సంబంధించి డబుల్ పంక్చర్ లాపరోస్కోపిక్ సర్జరీలో డాక్టర్ వెంకయ్య 30 మంది వైద్యులకు శిక్షణనిచ్చారు. వారు మరో 200 మందికి, వారు వేలమందికి శిక్షణనిస్తున్నారు. క్లిష్టమైనఈ శస్త్రచికిత్స ద్వారా 22 లక్షలకు పైగా మహిళలు ప్రయోజనం పొందారు. గడిచిన 20 ఏళ్లలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో డాక్టర్ వెంకయ్య దాదాపు లక్ష కుటుంబ నియంత్రణా ఆపరేషన్లు చేశారు. బటన్ హోల్ విధానంలో ఒకే రోజు 8 గంటల వ్యవధిలో 381 శస్త్రచికిత్సలు నిర్వహించిన ఘనులు డాక్టర్ వెంకయ్య.

మానవసేవే మాధవ సేవని నమ్మే డాక్టరు మాదాసి వెంకయ్య బ్రహ్మచారి. రోగులు, బాధల్లో ఉన్న వారి సేవలో తరించేందుకే ఆయన తన జీవితాన్ని ధారపోస్తున్నారు. నిరుపేదలకు వైద్య సేవలందించేందుకు ఆయన నెలకొల్పిన 'మదర్స్ ట్రస్టు" పేదలెందరికో ఆరోగ్యం ప్రదానం చేస్తోంది. 2013 లో భారత ప్రభుత్వం ఆయనకు స్త్రీ శక్తి పురస్కారాన్ని అందజేసింది.

డాక్టర్ మాదాసి వెంకయ్యను సాక్షి ఎక్సలెన్స్ అవార్డుతో సన్మానించడం సాక్షి మీడియా గ్రూప్ గౌరవంగా భావిస్తోంది.